


"డాక్టర్! మీరు. మీ రెలాగయినా, నాకీ ఉపకారం చేసి పెట్టాలి ప్లీజ్."

"ప్చ్. ఏమిటోనమ్మా నా కంతా అయోమయంగా ఉంది. ఈ రోజుల్లో ఇలాంటివి సామాన్యమై పోయాయి కానీ, నా మటుకు నాకు ఈ పద్ధతేం బాగా లేదు. రాబోయే పరిణామాలు తెలిసే కొందరమ్మాయి లెందుకు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతున్నారో అర్థం కాకుండా ఉంది."

"డాక్టర్! అదే నేనూ ఆలోచిస్తున్నాను. అసలీ లోపం ఎక్కడుంది? ఎందుకు, ఎందుకిలా జరుగుతూంది? నేను. . నేనొక్కదాన్నే కాదు. నా లాంటి అమ్మాయిలు ఎందరు ఇలా..."

"ఉ . ఈ సంగతి మీ పేరెంట్స్‌కి తెలుసా?"

"ప్చ్. తెలియదు."

"ఎందుకని?"

"నే నిక్కడ హాస్టల్‌లో ఉంటున్నాను."

"అర్థమైంది.తల్లి దండ్రులు కష్టపడి పంపించే డబ్బుని ఇలా వ్యర్థం చేస్తున్నా వన్నమాట హాస్టలు వాళ్ళ కళ్ళు గప్పి."

"నిజమే డాక్టర్! పొరపాటే జరిగింది."

"మీది అంత రిచ్ ఫామిలీనా?" ఆమెని చూస్తే అలా అనిపించటం లేదు. ఒంటి మీద ఉన్న వస్త్రువులు ఒకటీ అరా ఆర్టిఫిషియల్‌గానే ఉన్నాయ్. అయినా అడిగింది.

'లేదు డాక్టర్! మాది సామాన్య కుటుంబమే. నా తరవాత చాలా మందే ఉన్నారు. నాన్న తెచ్చేయు. డి. సి. జీతానికి కాస్త నేను ఆసరా కావాలనే న న్నిక్కడ చదువుకి పంపారు.'

"అయితే నువ్విక్కడ చేస్తున్న పనిదన్నమాట?"

" . . "

"మరి. ఫీజు చాలానే అవుతుంది" సూటిగా చూసిందామె ఆ అమ్మాయి కళ్ళల్లోకి.

"తెలుసు. అయినా తప్పదుగా? ఈ పాపాన్ని మోసి పరువూ, జీవితమూ పాడు చేసకోవడం కంటే ఇది నయమే."

"ఓ. రహస్యంగా జరిగితే పరువు నిలబడినట్లేనా? అయినా ఈ ఆలోచన ముందరే ఎందుకు కలగలేదు?"

మళ్ళీ మౌనంగా వూరుకుంది కైవల్య, తల దించుకుని.

"పెళ్ళి కావలసిన దానివి. ఈ విజం నిన్నెప్పటికీ భయపెడుతూనే ఉంటుంది. ఎప్పుడయినా బయట పడితే నీ జీవితం ఎలా తయారవుతుందో ఆలోచించావా?"

ఏదో చెప్పాలని పెదవులు అస్పష్టంగా కదిపి మళ్ళీ వూరుకుంది కైవల్య. ఒకసారి డాక్టర్ కళ్ళలోకి నిస్సహాయంగా చూసింది.

చూడు కైవల్యా! సాటి ఆడదానిగా, ఓ సోదరిగా నీకు సహాయం చేస్తానే అనుకో. అయితే నీ లాంటి అమ్మాయిల్ని నేను మళ్ళీ మళ్ళీ ప్రోత్సహించిన దాన్నే అవుతాను. అందుకనే ఇది నా కెంత మాత్రం ఇష్టం లేదు."

'ఈవిడ మళ్ళీ మొదటికే వచ్చిందే ఎలా టాకిల్ చెయ్యాలి?' అనుకుంటూ "అది కాదు డాక్టర్! మీ వృత్తి రీత్యా మీరు."

"ఎన్నో చేస్తా రంటావ్? ఇంకెన్నో చేసే ఉంటారంటావ్? అంతేనా?"

"నిజమే. డాక్టరుగా నా వృత్తి ధర్మాలు చాలా ఉన్నాయ్. అందులో ఇదొకటి కానీ నీ మీద జాలి పడీ, నీకు భవిష్యత్తు మీద ఆశ చూపించటానికీ, మీ కుటుంబం పరువూ నిలబెట్టడం నువ్వడిగింది ఒప్పుకుంటాను. కానీ ఇది అలుసు తీసుకుని ఎందరో కష్టాలు రావచ్చు. ఇంటే మీలాంటి వారి సంఖ్య పెరుగుతూండే కానీ తరగటం లేదు. అందుచేత చివరికి నేను డబ్బు కోసం గడ్డి తిన్న దాన్నవుతున్నాను. అటువంటప్పుడు పరోక్షంగా ఆలోచిస్తే, నాకు వృత్తి ధర్మం ఎలా అవుతుంది? అధర్మాన్నీ, అవినీతినీ ప్రోత్సహించినట్లేగా?"

'ఎన్ని తిట్టినా తప్పేదేముంది? కాస్త సహనం వహించి, తన పని పూర్తి చేసుకోకపోతే, ఈ ఆశకూడా ఉండదు. మిగతా అందరిలోకీ, ఈవిడే కాస్త నయమని చెప్పింది నళిని' అనుకున్న కైవల్య డాక్టర్ ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

"అసలీ పరిస్థితి ఎందుకు తెస్తున్నారు? చదువుకని వచ్చి ఎందు కిన్ని పెడదారులు తొక్కుతున్నారు. ఆడపిల్లలే ఇలా ఉంటే, ఇక మగ పిల్లల్ని అనుకోవలసిన పనేం ఉంది? అసలెందుకు యువతరం ఇలా తయారయింది? ఏం? అతను మోసం చేశాడా?" మళ్ళీ తనే అడిగింది డాక్టర్ నిర్మల.

"లేదు."

"మరి ?"

ఏం చెప్పాలో అర్థంకాక ఒక క్షణం తటపటాయించి—"అసలు—అసలు పెళ్ళి చేసుకోవాలనుకో లేదు" అని చెప్పి 'హమ్మయ్య' అనుకుంది మనసులో.

"అయితే... పూరికే ఎంజాయ్ చెయ్యాలనుకున్నావా?" తీవ్రంగా చూసిం దామె కైవల్య కళ్ళల్లోకి.

ఆ ధాటికి తట్టుకోలేని కైవల్య, మాన్పుకొని మరలప్పుకుని అన్నిటికీ మౌనం వహించింది.

"అతడిందుకు ఒప్పుకున్నాడా?"

'ఏమిటీ అర్థంలేని ప్రశ్న?' మనసులోనే తిట్టుకుని పెదవులు కొరుక్కుంటూ కూర్చుంది.

తెల్లగా, సన్నగా, నాజూగ్గా, విశాల నేత్రాలతో పెద్ద వాలుజడతో ఆకర్షణీయంగా ఉన్న శైవల్యని పరికించి చూసిన డాక్టర్—"అందమైన పిల్లవి. నీ అందమైన జీవితాన్నెందుకిలా పాడు చేసుకుంటావ్?" చాలా మెత్తగా మందలిస్తున్నట్టు అంది.

"మరి అంత ఫీజు ఎలా తెస్తావ్?" ఫీజుకైనా భయపడి ఏమైనా చెబుతుందన్న ఆశతో మళ్ళీ తనే అడిగింది డాక్టర్ నిర్మల.

ఎందుకిన్ని ప్రశ్నలు? విసుగ్గా అనుకుని, తనకి చెప్పడం ఇష్టం లేనట్లు ముఖం చిట్లించింది.

"ఆల్‌రైట్! రేపు ఉదయం కాఫీ తప్ప మరేం తీసుకోకుండా వచ్చెయ్!" ఇక లాభం లేదనుకుని చెప్పింది డాక్టర్.

థాంక్యూ డాక్టర్! థాంక్యూ అలాగే వార్నింగే వస్తేస్తాను." కృతజ్ఞతగా చేతులు జోడించి, నవ్వుతో వంగా వెళ్ళిపోయింది.

ప్చ్! ఈ కాలం పిల్లలు ఎందుకిలా తయారౌతున్నారు? విచక్షణ లేకుండా దిగజారుతున్నారంటే ఎక్కడుంది లోపం? సినిమాల ప్రభావమా? నాగరికతా వ్యామోహమా? ఫ్యాషన్ పేరిట అలవడుతున్న పాశ్చాత్య దృష్టా? స్త్రీ పురుషుల సమానత్వమా? లేక వరకట్న పిశాచాన్ని ఎదిరించుకోలేక వాంఛలు పడుతున్న పెళ్ళితో రాజీ పడలేని కోరికలా? వెరైటీ కోసమా? శాశ్వత, తాత్కాలిక సుఖమా? ఆడబుద్ధి పెంచుకుంటున్న అహంకారమా? ప్చ్! ఏది ఏమైనా ఈ ఫామిలీ ప్లానింగులు, అబార్షన్లు లీగలైజు చెయ్యటం గృహిణుల పాలిట వరమైతే కన్యలపాలిట వినోదంగా అటుపై శాపంగా పరిణమిస్తోంది. ఈనాడు ప్రతిదీ ప్రచారంగానే ఉంది. ఒక ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని చేసే పని ఇలా దుర్వినియోగమై అక్రమాలకీ, అనర్థాలకీ దారి తీస్తోంది. అంటే లోపం ఎవరిది? ఎక్కడుంది. వెళ్ళిపోతున్న ఆమె వైపు చూస్తూ ఆలోచించింది.

మరునాడు కాలేజీ ఎగ్గొట్టింది శైవల్య. మరో వారం పదిరోజుల దాకా ఎన్.సి.సి. క్యాంపు లేమైనా ఉంటే, తనకి తెలియజేయమని స్నేహితులకి చెప్పింది. ఇంతకుముందు కూడబెట్టుకున్న డబ్బంతా లెక్క చూసుకుని బేగ్‌లో వేసుకుంది. మరో రెండు పాత చీరలు, జాకెట్లు, లంగాలు, ప్లాస్టిక్ బుట్టలో సర్దుకుంది. ఈ సంగతి తన డియరెస్ట్ ఫ్రెండ్ నళినికి తప్ప మరెవ్వరికీ తెలీదు. ఆమెని సాయంత్రం కలవమని చెప్పి బయల్దేరింది.

నిజానికి నళిని ఈ మాత్రం ధైర్యం చెప్పి సలహా ఇచ్చింది కనుక సరిపోయింది. లేకపోతే తను ఏం చేసేదో? తనిలాంటి వాటిని చాలా ఈజీగా తీసుకుంటుంది. పైగా ధనవంతుల పిల్ల. ఏదేం చేసినా, సమర్థించుకోగలదు. అందుకే దానికి బాయ్ ఫ్రెండ్సు కూడా ఎక్కువ. లవ్ లేదు గివ్ లేదు, లైఫ్ అంటే లైట్‌గా తీసుకోవాలి. జాలీగా గడిపెయ్యాలి. పెళ్ళి, పిల్లలు, సంసారం అదంతా పెద్ద

> పుస్తకాలపై అభిలాష మనిషి విస్తృత భావాలను, ఉన్నతాశయాలను తెలియ పరుస్తుంది.
>
> —డానన్

బోర్! మనకెందుకు కా ఉరితాడు? తెలిసి తెలిసీ ఆ రొంపిలో దిగడం ఎందుకు? ఇలాగే బాధ్యతా రహితంగా, హాపీగా గడిపేస్తే పోలా? ఎవడో ముక్కూ మొహం తెలియని వాణ్ణి చేసుకుని, వాడి కింకరల్లిలా, వాడికి పిల్లల్ని కనే యంత్రంలా, ఈడుకో మంటగా కూటికీ గుడ్డకీ మొహం వాచి ఎందుకొచ్చిన బ్రతుకు? నాన్సెన్స్! నా ఉద్దేశంలో లైఫ్ అంటేనే అసహ్యం. ఐ హేట్ ఇట్!" అంటుంది. విచ్చలవిడిగా తిరుగుతూ, డబ్బు ఖర్చు పెడుతూ రోజు కోకరి మార్చినట్లు రోజుకో ఫ్రెండుతో తిరుగుతూ ఉంటుంది. అసలిలాంటివన్నీ చాలా సాధారణంగా తీసుకుంటుంది. అసలింత దాకా రావడానికి అందుకే తన తెలివి తక్కువని నిందించి ఇంకెప్పుడూ జరక్కుండా చూసుకోమంది.

"పిచ్చి ఆలోచనలతో బెంగ పెట్టుకుని, ఆత్మహత్యలు చేసుకునే రోజులు పోయాయ్. అందుకని, హాయిగా నాకు తెల్సిన లేడీ డాక్టరు ఒకావిడ ఉంది. కాకపోతే కాస్త డబ్బు తీసుకుంటుంది. కాని పని అయిపోతుంది. వెళ్ళు"మని సలహా ఇచ్చింది.

అవును ఒక రకంగా ఆలోచిస్తే నళిని వద్దనే తనకీ వచ్చింది. ఎందుకొచ్చిన పెళ్ళిళ్ళు? తనకి వూహ తెల్సిన నాటి నుంచీ తను చూస్తూనే ఉంది. తాగి తందనాలాడి చావగొట్టే భర్తలు, అడ్డమైన వాళ్ళని ఇంటికి తెచ్చి, పెళ్ళాం చేత సపర్యలు చేయించుకునే వాళ్ళు, రేసులు, పేకాటలు, సినిమాలు, క్లబ్బులు అలవాటున్న వాళ్ళనీ చుట్టుపక్కల ఇళ్లల్లో నిత్యం చూస్తూనే ఉంది. ఆ పెళ్ళాలు అటు పసుపురాక ఎటూ పోలేక, ఈ మొగుళ్ళ చేతుల్లో ప్రతిక్షణం చస్తూనే ఉన్నట్లు జీవచ్ఛవాల్లా బతుకుల్ని ఈడవడం తనకి తెలియంది కాదు. అంతదాకా ఎందుకు? గంపెడు సంసారం, గుమాస్తాగిరీ



చిత్రం — ఇ. గోపాలరావు

చేస్తూ తాగుడికి బానిసవి, నాన్న చేసే గొడవ తానెరగదూ? వాళ్ళ బాధలు పట్టా ఆర్థికస్థితితో అప్త సంబంధం లాటి అమ్మ—అబ్బ హారిబుల్. అందుకేగా తను ముఖ్యంగా ఈ సంకెలలోనుంచి కాస్త వూపిరి పీల్చుకోవాలని బయట పడింది?

నిజమే! ఈ రోజుల్లో కూడా ఈ పెళ్ళిళ్ళేమిటి? పెద్ద న్యూసెన్స్! హాయిగా చదువుకుని సంపాదించుకుంటూ, స్వేచ్ఛగా జీవితాన్ని గడపడంలో ఉండే తృప్తి, ఆనందం, ఇంకెందులో ఉంటుంది? అందుకే ఈ ఒక్కసారికీ ఈ డాక్టరు పుణ్యం కట్టుకుంటే తనింక ఇంతదూరం రాకుండా జాగ్రత్త పడవచ్చు.' ఆలోచిస్తూనే క్లినిక్ చేరుకుంది శైవల్య.

• • •

డాక్టర్ శైవల్యకు మందిచ్చింది. సాయంత్రం లోపల అబార్షన్ కావచ్చునీ, భయం లేదని ధైర్యం చెప్పి, అదేదాని చూస్తుండమని అర్జెంటు కేసు లున్నాయని హడావుడిగా వెళ్ళిపోయింది డాక్టర్.

సాయంత్రం నళిని వచ్చింది. గండం గట్టెక్కినందుకు సంతోషించి, "మరో నాలుగు రోజుల్లో డిశ్చార్జి చెయ్యవచ్చు. అంతవరకు వార్డెన్‌తో 'నాన్న సీరియస్‌గా ఉంటే వెళ్ళిందని చెప్తానులే. ధైర్యంగా ఉండు' అని చెప్పి కాసేపు కూచుని, మళ్ళీ మర్నాడు వస్తానని వెళ్ళిపోయింది.

నళిని ప్రతిరోజూ వచ్చి వెళ్ళటం తోనూ ముఖ్యంగా సమస్య పరిష్కారమైనందుకూ చాలా రిలీఫ్‌గా ఉంది శైవల్యకి. డాక్టర్ పట్ల, సలహా ఇచ్చి సహాయపడినందుకు నళిని పట్ల ఆమె మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

ఆరోజు శైవల్యను డిశ్చార్జ్ చేసి, బిల్లు తీసుకుంటూ అంది డాక్టర్—"చూడు శైవల్యా! చిన్నపిల్లవి, చాలా భవిష్యత్తు ఉన్న దానివి అని దేనంగీకరించానే కానీ ఈ తప్పుని సమర్థించి కాదు. నువ్వే కాదు. నీలా మరెవ్వరూ ఇలాటి పొరపాట్లు చెయ్యకూడదు. అందుకు నువ్వు మార్గదర్శిగా ఉండాలి. తెలిసిందా? ఆరోగ్యం జాగ్రత్త! చూశావా! ఇంత డబ్బు ఇలా వృథా కాకుండా ఉంటే ఇంకెన్నో మంచి పనులకి పనికొచ్చేదికదా?" మందలింపుగా అంది.

"అవును డాక్టర్!" తలదించుకుంది శైవల్య.

"ఇంతింతకీ ఈ డబ్బు ఎలా తెచ్చావ్? అప్పు చేశావా?"

"లేదు."

"మరి?"

ఒకసారి ఫిలాసఫీగా ఆమె కళ్ళల్లోకి చూసి, "ఎలాగూ అబార్షన్ చేయించుకుంటున్నాను కదా అని..."

"'కథా అని."

"పెరుగుతున్న ప్రాణికి తండ్రెవరో తెలుసుకోలేని నేను, మరో పలుగురు తండ్రి గాని తండ్రుల దగ్గర వసూలు చేసిందే మీకా కిచ్చిన ఈ ఫీజు!" నిర్భయంగా లేచి నిలబడింది.

"మై గాడ్!" స్థాణువులా ఉండి పోయింది డాక్టర్ నిర్మల. *